క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుపరచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో పారిశుధ్యం మెరుగుపరచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం మున్సిపల్ వార్డుల్లో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ పారిశుధ్య వాహనాలు మరమ్మతులు వస్తే, వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరచడానికి సత్వరమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి



డిజిటల్ స్క్రీన్‌పై వివరిస్తున్న శ్రీనివాస్

జగిత్యాల: హెచ్ఐవీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మెడికల్ కళాశాలలో బుధవారం మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌తో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎయిడ్స్ స్క్రీనింగ్ ప్రతి సబ్ సెంటర్‌లో జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది

బుగ్గారం: రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈటీ సింధూర్‌శర్మ అన్నారు. పొలంబాటలో భాగంగా బుగ్గారం గ్రామ పరిధిలో బుధవారం స్థానిక రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.రైతులు తమ పొలాల్లో ఇనుప బాక్సులకు బదులుగా ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులను అమర్చుకోవడం వలన ప్రమాదాలను నివారించవచ్చునన్నారు.అలాగే తమ మోటార్లకు కెపాసిటర్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. టంగ్‌టెస్టర్ అనే పరికరంతో అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఈ బండారి అశోక్,విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల: మండలంలోని నిరుపేదలకు జగిత్యాల అర్బన్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని బుధవారం మల్యాల బీజేపీ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన సుమారు 173 ఎకరాల భూమిని సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో మరో 4500 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అర్హులకు కేటాయించగా, మిగిలిన 750 ఇళ్లు మల్యాల మండలంలోని నిరుపేదలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ కుమార్, నులుగొండ సురేష్, జీవన్ రెడ్డి, చక్రం గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం

వెల్గటూర్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ యూనియన్ నిరంతరం పోరాటం చేసేచేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ప్రసాదరావు అన్నారు. వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన డీఏ వెంటనే విడుదల చేయాలన్నారు. బీఈడీ అర్హత ఉన్న ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్, ధర్మపురి అధ్యక్షుడు కాశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక విద్యార్థుల అవస్థలు



రేకులపల్లిలో బస్సు వెంట పరుగులు పెడుతున్న విద్యార్థులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు సకాలంలో ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, బీర్‌పూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. మండలంలోని మొత్తం 15 గ్రామాల్లో కొన్ని గ్రామాలు రోడ్డు వెంట లోపలికి, మరికొన్ని గ్రామాలు రోడ్డును ఆనుకుని ఉన్నాయి. మండలంలో చివరి గ్రామాల్లో ని విద్యార్థులు తప్పనిసరిగా బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి ఉన్నత పాఠశాలలకు రావాల్సి ఉంటుంది. విద్యార్థులు ఉదయం, సాయంత్ర పాఠశాలలకు, ఇళ్లకు వెళ్లే సమయాల్లో బస్సుల్లో రద్దీగా ఉండడంతో చాలామంది ఎక్కలేకపోతున్నారు. దీంతో పాఠశాలలకు ఆలస్యంగా వెళ్తున్నారు. విద్యార్థులు ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనదారులను లిఫ్ట్ అడిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. కొన్ని సార్లు రాత్రి ఎనిమిది అవుతుందని విద్యార్థులు, తల్లితండ్రులు వాపోతున్నారు. కిక్కిరిసిన బస్సుల్లో వెళ్లలేక పోతున్నామని, బస్సుల వెంట పరుగెత్తాల్సి వస్తుందని ఈ విషయంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పందించి బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఎండపల్లి మండలం గుల్లకోటలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సతీమణి కాంతకుమారితో కలిసి లక్ష్మణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. శిక్షణ కేంద్రం అద్దె చెల్లింపు విషయంలో ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి తానే స్వయంగా అద్దె చెల్లించారు. ఆసక్తి ఉన్న మహిళలు అందరికీ ఉచితంగా శిక్షణ ఇచ్చి, శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్‌తో పాటు, ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తామని లక్ష్మణ్ కుమార్ తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

పెగడపల్లి/జగిత్యాల: మండలంలోని వెంగళాయిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడు కడారి తిరుపతిని, మండలంలోని బతికపల్లిలో కుక్కదాడిలో గాయపడి జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మడిగల నిత్యాన్ష్ అనే బాలుడిని బుధవారం ప్రభుత్వం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు భాస్కర్, కిషన్, రాజేందర్, మల్లేశం, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్‌గేమ్ ఫెడరేషన్‌లో భాగంగా మండలస్థాయి పాఠశాల క్రీడలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నేటి జీవన విధానంలో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించడం హర్షనీయమని, స్పోర్ట్స్ హబ్‌గా గచ్చిబౌలిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో వాసం భీమయ్య, నాయకులు శేఖర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సురేందర్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 26 మందికి రూ. 6 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, పంబాల రాము తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీకి దరఖాస్తుల స్వీకరణ

మల్యాల: మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీ వద్ద రుణమాఫీ 2024 లో భాగంగా రేషన్ కార్డు లేని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, రామన్నపేట, పీఎస్‌సీఎస్ నూకపల్లి సంబంధించిన రైతుల కుటుంబ నిర్ధారణ కోసం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.వాణి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.చంద్ర దీపక్, ఏఈవోలు కారుణ్య కుమార్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

జగిత్యాలరూరల్: ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తుందని జగిత్యాల రూరల్ వ్యవసాయాధికారి తిరుపతినాయక్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండంలోని లక్ష్మీపూర్‌లో రుణమాఫీ కానీ రైతుల రేషన్ కార్డులను సర్వే చేసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డు లేని రైతులు వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. రేషన్‌కార్డు లేని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతాయని, సర్వే పూర్తి కాగానే ప్రభుత్వానికి వివరాలు సమర్పిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి రైతు రుణమాఫీపై సర్వే

ఇబ్రహీంపట్నం : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి వచ్చే నెల 17 వరకు రైతు రుణమాఫీపై కుటుంబ నిర్ధారణ సర్వే చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. వ్యవసాయ అధికారులకు సహకరించి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలను తీసుకవచ్చి అందజేయాలని కోరారు. 29న ఇబ్రహీంపట్నం, 30న కేశాపూర్, 31న కోజన్‌కొత్తూర్, 2న అమ్మక్కపేట, 3న డబ్బా, 4న ఎర్రాపూర్ , 5న వర్షకొండ, 6న కొమటికొండాపూర్, 9న గోధూర్, 10న తిమ్మాపూర్ , 11న యామపూర్, 12న ఫకీర్‌కొండాపూర్, 13న వేములకుర్తి, 14న మూలరాంపూర్, 16న బర్థీపూర్, 17న ఎర్దండి గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు తెలిపారు.



నిండుకుండలా బొమ్మెన ప్రాజెక్టు

కథలాపూర్: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు బొమ్మెన ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లు చేరాయని గ్రామస్తులు తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిగా నీరు చేరి మత్తడి లెవెల్ వరకు వచ్చాయి. ప్రాజెక్టులో భారీగా నీరు చేరడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ఈనెల 30న ఉదయం జిల్లా ఉపాధి కల్పనాదికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాదికారి బింగి సత్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆదర్శ నెక్సాలో రెసిడెంట్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఖాళీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు డిగ్రీ ఆపైన విద్యార్హత అర్హత ఉన్న వారు అర్హులని, ఎంపికైన వారు జగిత్యాల,కోరుట్ల, కరీంనగర్‌లో పనిచేయాల్సి ఉంటుందని, రూ.15వేల వేతనంతో పాటు ఇన్సెంటివ్స్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువకులు 30 వ తేదీ శుక్రవారం ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గంటల లోపు జిల్లా ఉపాధి కల్పనాదికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

మల్లాపూర్: ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి తుదిజాబితాలో ఉన్న ఓటర్ల వివరాల ప్రకారం సర్వే చేపడుతున్నారన్నారు. జాబితాలో ఉన్న చిరునామాలోనే ఉంటున్నారా.. మార్పు చేయాలా.. ఓటు బదిలీ చేయాలా.. వంటి వివరాలు సేకరించడంతో పాటు పేర్లు, చిరునామా సక్రమంగా ఉన్నాయో లేదా, ఏవైనా సవరణ చేయాల్సి ఉందో తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐలు సురేశ్, కైలాష్, బీఎల్వోలు పాల్గొన్నారు.

సంపద వనాలు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఏర్పాటు చేసిన సంపదవనాలను ఫారెస్ట్ విజిలెన్స్ అధికారి అనిత బుధవారం పరిశీలించారు. సంపదవనాలలో ఎంబీ ప్రకారం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, కొలతలను పరిశీలించి, మొక్కలకు నీటి సౌకర్యం, వివిధ రకాల పండ్ల మొక్కలు బాగుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంధర్‌రెడ్డి, ఎంపీవో చంద్రశేఖర్, పీఆర్ఏఈ అరుణ,ఏపీవో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లుల,జగ్గాసాగర్, రామలచ్చక్కపేట గ్రామాల్లో డీఎఫ్‌వో అనిత సంపద వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వనాలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

'బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయం: జువ్వాడి

కోరుట్ల: బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయమని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలో బుధవారం మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైందని అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వస్తుందని ముందే ఊహించామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు గమనించాలని కోరారు.స్థానిక సంస్థల్లో ప్రజలు రెండు పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహం ఆవిష్కరిస్తున్న యూత్ నాయకులు

రాయికల్: మండలంలోని ధర్మాజీపేటలో ఛత్రపతి శివాజీ యువసేన యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బలుసు రంజిత్ పటేల్ యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండల కేంద్రంలో దాదాపు 13 ఏళ్ల క్రితం ప్రారంభించిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. సెర్ప్ కార్యక్రమాలు, మహిళా సంఘాల సమావేశాలతో పాటు, బ్యాంకు లావాదేవీలు, కార్యాలయాల కార్యకలాపాలు వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. విడతల వారీగా ఇప్పటికీ ప్రభుత్వం రూ. 20 లక్షల వరకు ఖర్చు చేసింది. ఇంకా తలుపులు బిగించడం, ఫ్లోరింగ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ ఫిట్టింగ్ పనులు చేపట్టాల్సి ఉంది.. భవనం పూర్తికాకుండానే శిథిలావస్థకు చేరుతోంది.

సంప్రదించాల్సిన అధికారి మిలింద్, డీఈ పంచాయతీ రాజ్
ఫోన్ నంబర్, 7995565871

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639, 94400 61630, 9705346643

సత్యసాయి నిత్యాన్నదాన సేవకు 8 వసంతాలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు శ్రీసత్యసాయి నిత్యాన్నదాన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 8 వసంతాలు పూర్తి చేసుకుందని సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. నిత్యాన్నదాన పంపిణీలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అన్న బాబా వారి బోధనలు దివ్య ఆశీస్సులతో అనునిత్యం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద కుటుంబాలకు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. 28.08.2016న ఈ అన్నదానం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ 8 ఏళ్లలో దాదాపు 3 లక్షల మంది పేద ప్రజల కడుపు నింపడం ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన భక్తులు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ పూర్వ కన్వీనర్ చిటుమల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు, సభ్యులు గ్రామాల్లో ఉట్టికొట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై అశోక్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్‌ను ప్రమాదంలో గాయపడగా బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు.

ఛత్రపతి శివాజీ యువసేన యూత్ ఎన్నిక

రాయికల్: మండలంలోని ధర్మాజీపేటలో ఛత్రపతి శివాజీ యువసేన యూత్ కార్యవర్గంను బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బలుసు రంజిత్ పటేల్, ఉపాధ్యక్షుడిగా గంగారెడ్డి ,గూగుల్ పరశురాం,కోశాధికారిగా కుంభం మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా పాలకుర్తి వెంకటేష్, బలవేణి నరేందర్, సలహాదారులుగా భూమయ్య, శేఖర్ నిమ్మల తిరుపతి ధర్నావేని శ్రీనివాస్ పంబాల గంగన్న, లక్కం వినయ్, మల్లేశ్‌లను ఎన్నుకున్నారు.

రైతులకు అండగా ఉంటా

- మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ రాజు

ఇబ్రహీంపట్నం: రైతు బిడ్డగా రైతులకు అండగా ఉంటానని, రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు సహకారంతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తానని మార్కెట్ యార్డులో సీసీ ప్లాట్‌ఫామ్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా సహకరిస్తానని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజును టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డితోపాటు పలువురు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, మాజీ ఎంపీపీ పుష్పలత, మాజీ సీడీసీ చైర్మన్ సుగుణాకర్ రావు, తిమ్మణి రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **విద్య తోనే మూఢ నమ్మకాలు దూరం**

జగిత్యాలరూరల్: విద్యతోనే మూఢ నమ్మకాలు దూరమవుతాయని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం గంజాయి-మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో హెచ్ఎం చలపతి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **కరాటే మాస్టర్‌కు సన్మానం**

జగిత్యాలటౌన్: కుంగ్‌ఫూ పోటీల్లో జగిత్యాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించడంలో తోడ్పాటునందించిన మాస్టర్ వెంకటేశ్వర్లును బుధవారం జగిత్యాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రమేశ్, మల్లేశం తదితరులు ఉన్నారు.

- **దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ**

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం, మోడల్‌స్కూల్ బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి బుధవారం తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు.కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రజిత పాల్గొన్నారు.

- **మండల స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభం**

మల్యాల: మండలం లోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో బుధవారం మండల స్థాయి ఆటల ఎంపిక పోటీలను ఎంఈవో ఐత శ్రీనివాస్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్ ప్రారంభించారు. అండర్ - 14,అండర్ 17 బాలికల ఆటల పోటీలు నిర్వహించారు. 29 న బాలుర ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

- **ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు**

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్ అన్నార్లు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక తరలింపులో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతి తీసుకున్నాకే ఇసుక తరలించాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే మొదటిసారి జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్సై-2 రాజు, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

కథలాపూర్: పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో దొరికిన పలువురికి కోరుట్ల జడ్జి జరిమానా విధించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల వివిధ గ్రామాలకు చెందిన 34 మంది మద్యం సేవించి బైకులు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడగా కేసు నమోదు చేశామన్నారు. వీరిని కోరుట్ల కోర్టులో హాజరుపరచగా అందరికి కలిపి రూ. 22 వేలు జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

దుర్గామాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో దుర్గామాత ఆలయం నిర్మాణానికి బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మిస్తున్నామని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కులసంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.